
ప్రజాశక్తి

బుధవారం 15 నవంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

చదివే అలవాటును ప్రోత్సహించాలి

- డిజిటల్ గ్రంథాలయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం
- గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులలో చదివే అలవాటును ప్రోత్సహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సరస్వతి దేవి విగ్రహానికి, మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలను జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులలో చదివే అలవాటు తగ్గిపోతుందని, వారిలో చదివే అలవాటును ప్రోత్సహించాలన్నారు. చదవటం ఒక కళ అని, పుస్తకాలను ఏవిధంగా చదవాలో తమ వద్దకు వస్తున్న విద్యార్థులకు లైబ్రేరియన్లు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సాంకేతిక యుగంలో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచేలా గ్రామ స్థాయిలో డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు జిల్లా యంత్రాంగం కూడా లైబ్రరీలకు మద్దతుగా ఉండి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన ప్రకటించారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విషయ విజ్ఞానం

పుస్తక పఠనంతో విషయ విజ్ఞానం పెరగటంతో పాటు పరిపూర్ణ వ్యక్తిత్వం ఏర్పడుతుందని రాష్ట్ర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యార్థులు, ప్రజల అభిరుచికి ▶ 2లో

రిజిస్ట్రేషన్ కార్యాలయమే..

భూ వివాదాలకు కేంద్రం..

- రిజిస్ట్రేషన్లు, జీపీఏల్లో నిజమైన హక్కుదారులపై పరిశీలన శూన్యం
- ఎడాపెడా దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయడంతోనే అనేక వివాదాలు
- హక్కు లేకున్నా పత్రాలతో పంచాయితీలు
- ఈ తరహా కేసులే ఇప్పుడు ఒంగోలులో భూకబ్జాలకు కారణం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

హక్కు లేకున్నా ఏదో నకిలీ పత్రాలు పెట్టి కొన్ని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు కొందరు.. నకిలీ వీలునామాలను అడ్డుపెట్టుకొని కుటుంబీకుల పేరుతో గిఫ్ట్ కింద రిజిస్ట్రేషన్లు జరిగాయి. అద్దెలకు చేరిన ఇళ్లలోనే కొందరు నకిలీ పత్రాలతో ఆ ఇల్లే తమదంటూ యజమానులకే అడ్డం తిరిగి ఊసలు లెక్కపెట్టారు కొందరు.. అసలు హక్కే లేకున్నా ఎవరినో తెచ్చి జీపీఏ తీసుకొని సంచలనం కలిగించారు మున్సిపల్ ప్రజాప్రతినిధులు. ఇలాంటి అక్రమ వ్యవహారాలకు ఇప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయమే కేంద్రబిందువుగా మారింది. ఎందువల్లనంటే బయట డాక్యుమెంటు రైటర్లు చెప్పిందే వేదంగా భావించి రిజిస్ట్రేషన్లు చేయడమే.. ఈ ప్రక్రియలో ఎటువంటి పత్రాలను చూడటం లేదు. అదేమని అడిగితే ఆ పత్రాలను చూడాల్సిన అవసరం లేదంటూ బాధితులకు సమాధానం చెబుతున్నారు. తమ భూమిని ఎవరికో ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ కొందరు నిలదీస్తున్నా సమాధానం రావడం లేదు. కారణం తెరచాటున జరిగిన అక్రమ బాగోతాలే.. సిట్ దర్యాప్తులో ఉన్న అనేక కేసుల్లో నకిలీ పత్రాలతో జరిగిన రిజిస్ట్రేషన్లదే కీలకంగా ఉంది. వీటిని అడ్డుపెట్టుకుని కోర్టులకు పోతారు. కోర్టులో నెంబర్ రాగానే అక్రమదారులకు కలిసొస్తుంది. ముందు ఆ భూమి వివాదంగా మారుతోంది. కోర్టులో నిర్ణయం కోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నారు. దాంట్లోకి వెళ్లాలన్నా పూర్వం నుంచి హక్కు ఉన్నా యజమానులకు ఇబ్బందిగా మారుతోంది. వచ్చిన ఫిర్యాదుల్లో అనేక కేసులు ఇలాగే ఉన్నాయి. తమ భూమికి దొంగ కాగితాలతో రిజిస్ట్రేషన్ చేశారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. తాజాగా మండువారిపాలెం జీపీఏ విషయంలోనూ రిజిస్ట్రేషన్ అధికారుల తప్పిదం తేటతెల్లమవుతోంది.

ఈ భూములు అద్దంకికి చెందిన బ్రాహ్మణులవి. కాలక్రమంలో వాటిని సాగు చేసుకుంటున్న రైతులకు విక్రయించారు. సర్వే నెంబరు 494లో ఉన్న 61.22 ఎకరాలకు హక్కుదారులున్నారు. వారంతా ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ వారికి ఎటువంటి ఇబ్బందీ లేదు. అందరికీ పొలాలతాలూకు పక్కా డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. అయితే హఠాత్తుగా అందులో ఉమ్మడి హద్దులను పలకరించి ఏడు ఎకరాలకు ప్రభుదాస్ అనే వ్యక్తి పేరుతోనూ, మరో ఏడు ఎకరాలు మేయర్ భర్త పేరుతో శ్రీనివాసరావు అనే వ్యక్తి జిపిఏ ఇచ్చినట్లుగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పక్కాగా కాగితాలు ఇచ్చారు. ఈ ప్రక్రియలో జీపీఏ చేస్తున్న వ్యక్తికీ ఈ భూములకు ఎటువంటి సంబంధం ▶ 2లో

అసైన్డ్ భూములు కొని..

ఇసుకను తవ్వేసి..

- అధికార పార్టీ నేతలకు ఆదాయ వనరుగా ఇసుక రవాణా
- జేపీ సంస్థ పేరుతో అక్రమ అమ్మకాలు
- కనుమరుగవుతున్న తీరప్రాంతంలోని ఇసుక దిబ్బలు



వేటపాలెం వద్ద ఉన్న ఇసుక డంపు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అధికారం అండగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. చాలాకాలంగా జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి కూడా ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా సరే కొందరు ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లాలో ఉన్న సముద్రతీర ప్రాంతాల నుంచి ఇసుక తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవు. అయినప్పటికీ చినగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల, నిజాంపట్నం, కర్లపాలెం, రేపల్లె ప్రాంతాలతో పాటు జిల్లా పరిధిలో ఉన్న కృష్ణాపరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతూనే వచ్చాయి. తీర ప్రాంతంలో గతంలోనే ఇసుక గుట్టలను అక్రమార్కులు కొల్లగొట్టారు. ప్రస్తుతం పెద్దగా ఇసుక గుట్టలు లేకపోవడంతో గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్‌భూముల్లో ఉన్న ఇసుకను తవ్వి అమ్మేస్తున్నారు. కొందరు అయితే ఇసుక అమ్మకాల కోసమే అధికార పార్టీలో చేరి తమ అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. తీరప్రాంతంలో ఉన్న రొయ్యల చెరువుల కారణంగా మంచినీరు ఉప్పునీరుగా మారి పంటల సాగు కష్టమవుతోంది. ఇలాంటి భూములు సాగుకు ఉపకరించక నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇలాంటి భూములను కొందరు కొనుగోలు చేసి ఇసుక అమ్మకాలు జరుపుతున్నారు. పొలాల మధ్య పెద్ద పెద్ద గోతులు తీసి ఇసుక అమ్ముతున్నందున ఆ చుట్టు ఉన్న మాగాణి భూముల్లో నీరు నిలువ ఉండే పరిస్థితి లేక ఆ గుంటల్లో చేరుతోంది. ఇలా రైతులు నష్టపోతున్నారు.

చీరాల, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న అటవీ భూముల నుంచి కూడా యథేచ్ఛగా ఇసుక తరలిపోతోంది. అధికంగా సర్వీ చెట్లు, యూకలిప్టస్ చెట్లతో ఉన్న అటవీ భూములకు మార్గాలు వేసుకొని వెళ్లి పెద్దపెద్ద గొయ్యిలు తీసి.. ఇసుక తరలిస్తున్నారు. ఆ గోతుల్లో అక్కడ ఉన్న చెట్లు వేసి కనిపించకుండా చేస్తున్నారు. అలాగే పూర్వకాలం నుంచి సముద్రం ఆటుపోట్ల నుంచి తీర ప్రాంతాలు ముంపుకు గురికాకుండా రక్షణగా ఉంటున్న ఇసుక దిబ్బలను, సముద్రంలో వాగులు, కాలువలు కలిసే చోట మేట వేసి ఉన్న ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ఈ ఇసుక అమ్మకాల గురించి సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకునే పరిస్థితులు లేవు. ఎక్కడయినా అధికారులు ఇసుక తవ్వకాలను ఆపేందుకు వెళ్లినా మొక్కుబడిగా అక్కడ ఉన్న ప్రొక్లయినర్ లేదా ట్రాక్టర్‌లను పట్టుకోవడం.. ఆ తరువాత పైనుంచి వచ్చిన ఒత్తిడి వల్ల వాటిని వదిలిపెడుతున్న సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో కొందరు అధికారులు ఎవరికి వారు కొంత మొత్తాలను నిర్ధేశించుకుని ఇసుక అక్రమ అమ్మకాలను ▶ 2లో

మంటల్లో మర బోటు

- ఇద్దరికి తీవ్రగాయాలు
- రూ.60 లక్షల వరకు నష్టం



దగ్ధమవుతున్న మర బోటు

ప్రజాశక్తి-నిజాంపట్నం

దీపావళికి రెండు రోజుల సెలవుల అనంతరం చేపల వేటకు సిద్ధమైన మరబోటులో మంటలు వ్యాపించింది. ఏం జరిగిందో తెలుసుకొనే లోపే బోటంతా మంటల్లో కాలిపోయింది. అందులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది.

స్థానికుల కథనం ప్రకారం.. దీపావళి పండుగ సందర్భంగా అన్ని బోట్లనూ వేటకు వెళ్లకుండా హార్బర్ జెట్టీలో నిలిపేశారు. మంగళవారం తిరిగి వేటకు పంపించడం కోసం అవసరమైన సరుకులను బోట్లకు కావలసిన ఇంధనాల్ని నింపుకొనే పనిలో నిమగ్నమయ్యారు. దండుప్రోలు చెన్నయ్యకు చెందిన మర బోటులో ఒక్కసారిగా ఉవ్వెత్తున మంటలు లేచాయి. వేటకు వెళ్లటానికి సిద్ధంగా డీజిల్ నిండుగా నింపి ఉండటంతో డీజిల్‌కు మంటలు అంటుకొని చుట్టుపక్కల వాళ్లు వచ్చేసరికే బోటు పూర్తిగా దగ్ధమైంది. బోటులో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, కష్ణ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు అంబులెన్స్ ద్వారా నిజాంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సుమారు బోటు విలువ రూ.60 లక్షల పైబడి ఉంటుందని, అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికే పూర్తిగా దగ్ధమైందని బోటు యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్ ఇంజన్ వద్ద వచ్చిన షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు మత్స్యకారులు భావిస్తున్నారు.

హరినాథ్‌బాబు పరామర్శ

బోటు దగ్ధమైన ఘటన జరిగిన విషయం తెలుసుకుని రాజ్యసభ సభ్యులు ▶ 2లో



కాలిన గాయాలతో ఓ బాధితుడు

రిజిస్ట్రేషన్ కార్యాలయమే.. భూవివాదాలకు కేంద్రం..

(మొదటిపేజీ తరువాయి)

ఉంది? నిజంగా ఈ భూములకు ఆయనేనా యజమాని? దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు ఎలా ఉన్నాయి? జిపిఎ అగ్రిమెంటులో ఏం రాశారు? అనేది పరిశీలన చేయకుండానే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జిపిఎ చేశారని బాధిత రైతులు అంటున్నారు. దీనిపై కార్యాలయానికి వెళ్లి అడగ్గా వారిపై కేసులు పెట్టాలని సూచించారని సమాచారం. జరిగిన జిపిఎ రిజిస్ట్రేషన్ అంతా తప్పిదంగానే భావిస్తున్నారు. ఇక్కడ కేవలం రిజిస్ట్రేషన్ శాఖ తప్పిదాల వల్లనే ఈ భూవివాదం తెరపైకి వచ్చిందని స్పష్టంగా చెప్పొచ్చు. జీపీఏను అడ్డుపెట్టుకొని హద్దులు వేయడం, వేరేవారి పేర్లపై హక్కుపత్రాలు సృష్టించడం, రిజిస్ట్రేషన్లు చేయడం వాటిని పట్టుకొని కోర్టులకు ఎక్కడం జిపిఎ పొందిన వ్యక్తుల వ్యూహంగా కనిపిస్తోంది. సాగు చేసుకుంటున్న ఈ భూములు అనవసరంగా వివాదంలోకి పోతాయి. బాధిత రైతులు గుర్తించకపోతే భవిష్యత్‌లో ఇదే జరిగేది. అయితే రాజకీయంగా దుమారం రేగడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. రైతులు ప్రతిఘటించడంతో కబ్జాదారులు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. అవేవీ నమ్మశక్యంగా కనిపించడం లేదు. అదేవిధంగా పట్టణానికి చెందిన మాజీ డిసిసి అధ్యక్షుడు పసుపులేటి మాలకొండయ్య భూమికి సంబంధించిన కేసులోనూ రిజిస్ట్రేషన్ శాఖ తప్పిదం ఉంది. ఈ భూమికి హక్కుదారులకు సంబంధం లేని ఓ మహిళ పేరుతో వీలునామా సృష్టించారు. దాన్ని ఓ మత సంస్థకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా యజమానులు గుర్తించారు. అప్పుడు ఏం జరిగిందో తెలుసుకుని అవాక్కయ్యారు. ఈ కథనం ప్రజాశక్తిలోనూ ప్రచురితమైంది. న్యాయం కోసం బాధితులు సిట్‌ను ఆశ్రయించారు. ఇక్కడా రిజిస్ట్రేషన్ శాఖ తప్పిదమే కీలకంగా ఉంది. హక్కుదారులు అన్ని పత్రాలు పరిశీలన చేసినట్లయితే ప్రారంభంలోనే ఈ కబ్జా గానీ, వివాదం గానీ జరిగేది కాదు. నకిలీ రిజిస్ట్రేషన్లు ఎలా జరుగుతున్నాయన్నదే ఇప్పుడు సమాధానం దొరకని పెద్ద ప్రశ్న. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై అడ్డదారిన వీటిని చేస్తున్నారు. ఈ రిజిస్ట్రేషన్లలో కోర్టులకు వెళ్లడం జరుగుతోంది. తమకూ హక్కులున్నాయంటూ రిజిస్ట్రేషన్ పత్రాలనే కోర్టుల్లో పెడుతున్నారు. రెండు వైపులా లాయర్లు కేసులను సాగదీస్తుంటారు. కొన్నేళ్లకు విసుగెత్తి కోర్టు బయట పంచాయితీలు పెడుతున్నారు. ఎంతోకొంత ఎవరికో ఒకరికి పెద్దమనుషులకు ఇవ్వాలని చెప్పడం.. వాళ్లూ కొంత తీసుకోవడం రాజీలు చేయడం నిత్య కృత్యంగా మారుతున్నాయి. గతంలో కొన్ని భూములకు సరైన పత్రాలు లేవు. గ్రామాల్లో బాండు కాగితాలపై రాసుకొని సాగు చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ ఖర్చులకు డబ్బుల్లేక చాలా మంది రైతులు కాగితాలపైనే అగ్రిమెంట్లు చేసుకుని సాగులో ఉన్నారు. ఇలాంటివాటిని ఇప్పుడు కొందరు కబ్జా స్వభావం ఉన్న వ్యక్తులు, నేతలు కలిసి వివా దాల్లోకి లాగుతున్నారు. ఈ భూములను ఎక్కడున్నాయో చూస్తున్నారు. వాటిని గుర్తించి నకిలీపత్రాలు సృష్టించి యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ అక్రమాల్లో రిజిస్ట్రేషన్ అధికారులు కూడా కీలకంగా మారారు. ఇందుకోసం ఈ కార్యాలయానికి భారీగానే ముడుతున్నాయనే విమర్శలున్నాయి. ఈ శాఖపై ఇప్పుడు ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. భూ వివాదాల్లో ఈ శాఖ పాత్ర ఎంతనేదీ నిగ్గుతేల్చాలి.

మంటల్లో మర బోటు

(మొదటిపేజీ తరువాయి)

మోపిదేవి వెంకటరమణారావు సోదరుడు వెంకట హరినాథ్‌బాబు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దగ్ధమవుతున్న బోట్లను పరిశీలించారు. బోరున విలపిస్తున్న బోటు యజమానిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నయ్య మోపిదేవికి విషయాన్ని తెలియజేసి.. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నా భూశంకరు, బోటు యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, నిజాంపట్నం పంచాయతీ వైస్ సర్పంచ్ మోపిదేవి మార్కండేయులు పరిశీలించారు.

వివాహ వేడుకలకు బాలినేనికి ఆహ్వానం

ప్రజాశక్తి-పామూరు

పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి కుమారుడు జస్వంత్ రెడ్డి,అనూషారెడ్డి వివాహ వేడుకలు ఈనెల 23న స్థానిక పువ్వాడి కన్వెన్షన్ హాల్‌లో జరగనున్నాయి. అందులో భాగంగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో బైరెడ్డి జయరామిరెడి ,రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, కనిగిరి ఎఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు, ఒమీగ విద్యాసంస్థల కరస్పాండెంట్ కల్లూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శీలంవారిపల్లెలో పశు విజ్ఞానబడి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

పశువులకు సోకే వ్యాధుల పట్ల పోషకులు అవగాహన కలిగి ఉండాలని కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బీ బుజ్జి తెలిపారు. మండల పరిధజలోని శీలం వారి పల్లిలో పశు వైద్యాధికారి మునీర్ అధ్యక్షతన పశు విజ్ఞాన బడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు పశువైద్యాధికారి మునీర్ పశువుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోషకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి టి.బాబూరావు మాజీ ఎంపిటిసి మునగల వెంకట నారాయణ రెడ్డి, పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.

18న మండల సమావేశం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నటఉల ఆయన తెలిపారు. మండల పరిధిలోని ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

అసైన్డ్ భూములు కొని..ఇసుకను తవ్వేసి..

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోవడం మానేశారు. కొంతకాలంగా చూస్తే 216 జాతీయ రహదారిలో పందిళ్లపల్లి వద్ద ఎప్పటినుంచో ఉన్న పెద్ద ఇసుక దిబ్బలు మాయమయ్యాయి. కడవకుదురు వద్ద ఇసుక డంపును పెట్టి ఇసుక అమ్మకాలు జరిపారు. ప్రస్తుతం వేటపాలెం వద్ద ఇసుక డంపు పెట్టి అమ్ముతున్నారు. చీరాల అటవీ భూముల్లో ఇసుక కొట్టుకెళుతున్నారు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సముద్రంలో కలిసే ప్రాంతంలో ఒంపు వద్ద ఉన్న ఇసుకను తరలించారు. చీరాల మండలంలోని కాపూరివారిపాలెం పొలాల్లో నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. అక్కడి రైతులు సిపియం నేతల అండతో అడ్డుకున్నారు. రాత్రుళ్లు కాపలాలు కాసినా ఇసుక రవాణాను అడ్డుకోవడం కష్టమవుతోంది. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాలో అధికార పార్టీ నేతలు ఉండటంతో ఇసుక అక్రమ రవాణాను నిరోధించడం కుదరడం లేదు. ఎక్కడయినా అధికారులు ఆపినా ప్రభుత్వ భవనాలు, పక్కా గహాలు, నాడు-నేడు పాఠశాలల నిర్మాణం పేరు చెప్పి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు వందల క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే సదరు అక్రమార్కులు లక్షల క్యూబిక్ మీటర్ల మేర ఇసుక తవ్వుతున్నారు. ఇటీవల జిల్లాలోని కర్లపాలెం మండలంలో 27 క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు గుర్తించి బాధ్యులపై రూ.1.40 కోట్ల మేర జరిమానా విధించినట్లు అధికారులు ప్రకటించారు. ఇలా చూస్తే జిల్లాలో జరిగిన అక్రమ తవ్వకాలకు కోట్ల రూపాయల మేర జరిమానాలు వేయాల్సి ఉంది. కాగా జిల్లాలో అధికారికంగా ఇసుక అనుమతుల కోసం రెండు ఇసుక రేవుల్లో తవ్వకాలకు అనుమతులపై జిల్లా స్థాయి కమిటీ ఇటీవల ఆమోదముద్ర వేసింది. కొల్లూరు మండలం గాజులంక గ్రామంలో 49,499 క్యూబిక్ మీటర్లు, కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామంలోని ఇసుక రేవు నుంచి 49,600 క్యూబిక్ మీటర్లు తవ్వకాలకు అనుమతులిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం చూస్తే జిల్లాలో మరెక్కడ నుంచి కూడా ఇసుక తవ్వకాలు జరపకూడదు. కానీ ఇసుక అక్రమార్కులు అనుమతులున్న చోట కాకుండా మిగిలిన చాలా ప్రాంతాలలో ఇసుక అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నా కఠినమైన చర్యలు తీసుకునే పరిస్థితులు ఉండటం లేదు.

చదివే అలవాటును ప్రోత్సహించాలి

(మొదటిపేజీ తరువాయి)

తగినట్లుగా వివిధ పుస్తకాలను గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచుతామన్నారు. వీటికి సంబంధించిన వివరాలు తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలను గ్రంథాలయాలలో ఏర్పాటు చేస్తామనాన్రు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రాచగొర్ల వెంకట సునీల, కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, ఒంగోలు ఎంఇఒ కిషోర్, త్రిపురాంతకం జడ్పీటిసి మాకం జాన్‌పాల్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్

ప్రజాశక్తి - కనిగిరి

రాజ్యసభ సభ్యులు, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ సాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని హైదరాబాదులో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి విజయసాయిరెడ్డి, బాలినేనికి వివరించారు. కనిగిరి నియోజక వర్గం పార్టీ అభ్యున్నతికి, రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి తాను చేస్తున్న కృషిని వారికి వివరించారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మూరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోకారు.

ఇనుప సువ్వలు గుచ్చుకొని మహిళ మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి ఖాదర్ ఖాన్ సెంటర్ సమీపంలో డ్రైనేజీ పనులు నెలల తరబడి సాగుతుండగా కాలువ నిర్మాణం చేసినప్పటికీ పైన మూతలు వేయకపోవడంతో కాలువ దాటేందుకు రహదారి పక్కనే నివాసముంటున్న మంచాల మరియమ్మ (50) అని మహిళల మంగళవారం మృతి చెందింది. ఇటీవల కాలంలో డ్రైనేజీ కొరకు నిర్మాణం రెండు నెలలుగా జరుగుతుండగా డ్రైనేజీ ఆ ప్రాంతంలో కొంతమేర పూర్తి చేసిన కాంట్రాక్టర్, పైన మూత వేయకపోవడంతో దాటేందుకు తాత్కాలికంగా చెక్కను వేసుకొని రాకపోకలు సాగిస్తుండగా, అదుపుతప్పి మృతురాలు మరియమ్మ కిందకు పడగా, శరీరంలోకి దూసుకెళ్లిన డ్రైనేజీ నిర్మాణం కొరకు ఉంచిన ఇనుప సువ్వలు , మృతురాల శరీరంలోకి దిగబడి తీవ్ర గాయాల పాలవగా కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కొరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. నత్తనడకన నిర్మాణం సాగుతున్న తీరును ప్రజాశక్తి గతంలో అనేక కథనాలు ప్రచురించారు, అధికారులు నిర్మాణ సంస్థ సహకారం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జాతీయ రహదారుల నిర్మాణ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ ఈ విషయాన్ని పై అధికారులు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.


మరియమ్మ (ఫైల్)

గుండెపోటుతో ఆర్‌టిసి కండక్టర్ మృతి

ప్రజాశక్తి-పొదిలి

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మతి చెందిన సంఘటన పొదిలి డిపోలో జరిగింది. ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ ఖాసిం(55) సర్వీస్ నెం: 625925, సోమవారం రాత్రి విధులు నిర్వహించేందుకు పొదిలి డిపోలో విశ్రాంత గదిలో ఉన్నాడు. మంగళవారం తెల్లవారుజామున వినుకొండ డ్యూటీ పోవాల్సి ఉండగా ముందురోజు రాత్రి గుండెపోటు గురయ్యాడు. వెంటనే ఆర్టీసీ సిబ్బంది వైద్యశాలకు ఆయనను తరలించారు. అప్పటికే ఖాశిం మతి చెందినట్లు వైద్యులు దవీకరించారు. పొదిలి డిపోలో కండక్టర్‌గా 2005 నుండి పని చేస్తున్నాడు. మృతుడి స్వగ్రామం గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామం. కండక్టర్ మరణవార్త తెలిసిన డిపో మేనేజర్ సుందరరావు, సిబ్బంది, ఉద్యోగులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. అనంతరం మతదేహాన్ని వారి స్వగ్రామం పొదలకుంటపల్లికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఖాశిం మృతికి సంతాప సూచకంగా ఆర్టిసి ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హజరయ్యారు.

రాష్ట్రంలో వైసీపీకి పాలించే అర్హత లేదు : ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్రంలో ఇక స్థానం లేదని, పరిపాలించే అర్హత లేదని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి జగన్ ప్రభుత్వం పై మండిపడ్డారు. బాబు షుర్యిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో పర్యటించిన అశోక్ రెడ్డి వార్డులోని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు మహిళలకు వివరించారు. ప్రజలకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అన్నీ వర్గాల ప్రజలను నట్టేట ముంచిందని, రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత వైసీపీ ప్రభుత్వానికి లేదని, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని ప్రతీ ఒక్కరూ చంద్రబాబుకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, ప్రధాన కార్యదర్శి పందీటి రజినిబాబు, స్థానిక టీడీపీ ఎస్సి నాయకులు పానుగంటి ఇజ్రాయేలు, మద్దూరి బాలయ్య, గుంటూరి ఇజ్రాయేలు, గుర్రం చిన్ను, వరాలు, పి. రాజు, సిరివెళ్ళ ఆంటోనీ, గోడి ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కటికె యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.


పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఇఇ నాగేశ్వరరావు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి, పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలో మంగళవారం విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అదనపు లోడు వినియోగిస్తున్న 26 సర్వీసులకు రూ. 97,400లు, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 77 మందికి రూ.3,13,000 లు జరిమానా విధించినట్లు ఏఈ కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్సు డీఈ వి శ్రీనివాసరావు, డీఈ ఎ శ్రీనివాసరావు, ఏఈ బి కోటేశ్వరరావు, ఏఈ మౌలాలి ఖాన్, ఆపరేషన్ డిఈ బివై శేసగిరిరావు, డిఈ ఎస్ సియానాయక్, ఏఈలు బందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల మేజర్ పంచాయతీ పరిధిలోని హసనాబాద్ గ్రామంలో వైసీపీ గృహసారధిగా పని చేస్తున్న మందా యిర్మీయ తండ్రి మందా పాపయ్య అనారోగ్యంతో మబణించాడు. విషయం తెలుసుకున్న దోర్నాల పంచాయతీ ఉపసర్పంచ్ డీ రసూల్ పాపయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం తన సొంత నిధులు రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందా గురవయ్య, బెజవాడ రామయ్య, యలకపాటి భాస్కర్, బరిగెల వెంకటయ్య, యలకపాటి చిర్రయ్య, ఎరుకలయ్య తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు టీడీపీ, జనసేన నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్ రెడ్డి,నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బెల్లంకొండ సాయిబాబా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చికున్నారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 15 వ తేదీ బుధవారం పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో టీడీపీ–జనసేన నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇరువురు నేతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు గిద్దలూరు జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, పాలుగుల్ల ప్రతాప్ రెడ్డి, దప్పిలి భాస్కర్ రెడ్డి, మహానంది యాదవ్, లంకా నరసింహారావు, గజ్జలకొండ నారాయణ, కాల్వ బాల రంగయ్య, తాటిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాతపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వివేకానంద సేవా సమితి, ఉప్పుగుండూరు వారి ఆధ్యర్యంలో "బాలల దినోత్సవం" పురస్కరించుకొని పెదగంజాంలోని ప్రాదమిక పాఠశాల(వై సి) లోని విద్యార్థులకు రాత పుస్తకాలు, కలములు మంగళవారం వివేకానంద సేవా సమితి సెక్రెటరీ పావులూరి శివాజీ సేవా సమితి సభ్యులు మాచవరపు చిరంజీవిలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు టివిఎస్ శైలజ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలను దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. వివేకానంద సేవాసమితికి దాతలకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో బి సుకన్య , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టీవీ బహూకరిస్తున్న దృశ్యం

టీవీ బహూకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణం జవహార్‌నగర్ కాలనీలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలోని విద్యార్థులకు వినోదం కల్పించేందుకు అవసరమైన 32 సెంటమీటర్ల పొడవు కలిగిన కలర్ టీవీని 'దివిజ హాస్పటల్' అధినేత డాక్టర్ సీతారామిరెడ్డి మంగళవారం బహుకరించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగ విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో మల్లంపాటి చెన్నారెడ్డి, ఆ పాఠశాల ప్రిన్సిపల్ షేక్ భాను తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

చిన్నారులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - గిద్దలూరు

అనాథ పిల్లలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న తల్లి లేదా తండ్రి లేని 93 మంది పిల్లలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలా నాగభూషణం రెడ్డి తన స్వంత నిధులు సుమారు రూ 80 వేలతో దుస్తులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పాఠశాల విద్యార్థినీలతో మాట్లాడుతూ వారు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలా నాగభూషణం రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కడప లక్ష్మి, కడప వంశీధర్ రెడ్డి, కౌన్సిలర్ గడ్డం భాస్కర్ రెడ్డి, వైసీపీ నాయకులు బొర్రా కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మండలంలోని అంబవరం గ్రామం దేరంగుల వెంకటరమణ(40) అనే వ్యక్తి తన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూనే గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. తనకి భార్య ఉన్నారు. మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద మట్టి ఖర్చులకు, తక్షణ సహాయంగా మట్టి ఖర్చులకు గాను రూ.10వేలను గ్రామ సర్పంచ్ కృపమ్మ మృతుని భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి సిరిపిరెడ్డి సూర్యనారాయణరెడ్డి. కార్యదర్శి చేదుల్ల భూతేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


వెంకటరమణ (ఫైల్)


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ సోమయ్య

వేర్వేరు ప్రాంతాల్లో నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల

ప్రజల ప్రాణాలతో చెలగాటం వాడుతున్న నాటు సార తయారు చేసిన విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ సోమయ్య అన్నారు. మంగళవారం నాటు సారా తయారీ కేంద్రాలపై సెబ్ అధికారులు కారులు దాడులు నిర్వహించారు. చీరాల సాయికాలనీకి చెందిన ఆర్.ప్రభ అనే మహిళ నాటు సారా విక్రయిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. నాటు సారా తయారు చేస్తున్న లేక అమ్ముతున్నట్లు ప్రజల గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఇది ఇలా ఉండగా పేరాల ఆనంద్‌పేటకు చెందిన యాతం దీపక్ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న 2టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 2 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దీపక్‌ను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

ప్రజాశక్తి-కనిగిరి

మండలంలోని చిన్న ఇర్లపాడు సచివాలయం పరిధిలో జగనన్న రాష్ట్రానికి ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలనను వారు వివరించారు. కన్వీనర్ సంగు సుబ్బారెడ్డి, సర్పంచ్ దీనమ్మ, బాబు, రమేశ్, యూత్ లీడర్ మహేంద్రరెడ్డి, సెక్రెటరీ మల్లికార్జున రెడ్డి, గృహ సారథులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం
తహశీల్దార్ అశోక్

ప్రజాశక్తి-పొదిలి

బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పొదిలి మండలం ఏలూరు గ్రామ సచివాలయంలో గతంలో సీజ్ చేసిన ఇసుకను వేలం వేస్తున్నట్లు తాహశిల్దార్ సిహెచ్ అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 180 మెట్రిక్ టన్నుల ఇసుక వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలం కార్యక్రమంలో ఎస్ఐ వెంకట సైదులు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఆసక్తి కలవారు ఈ వేలం పాటలో పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

కుంట సర్వేను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నూతలపాడులో పేర్రాజు కుంట సర్వేను రైతులు అడ్డుకున్నారు. గ్రామంలో సర్వే నెంబర్ 32 నందు 22.41ఎకరాల విస్తీర్ణంలో గతంలో కుంట ఉండేది. దాని బాగోగుల నిమిత్తం సర్వే నెంబర్ 367/1 నందు 15ఎకరాల విస్తీర్ణంలో సాగుభూమి కలదు. కాలక్రమేణా కుంట పూడిపోవడంతో గ్రామానికి చెందిన సుమారు 45మంది సన్న, చిన్నకారు రైతులు కుంటను తలా కొంచెం పంచుకొని సాగు చేసుకుంటున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొత్త వీరారెడ్డి, విన్నకోట కోటేశ్వరరావు హైకోర్టుని ఆశ్రయించారు. వర్షాలు పడక తమ భూములు ఎండిపోతున్నాయని, మేతకు వెళ్లిన పశువులు నీళ్లలేక అల్లాడిపోతున్నాయని పేర్రాజు కుంటలో ఆక్రమణలు తొలగించి మళ్ళీ కుంటను త్రవ్వించాలని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పేర్రాజు కుంట సమస్యను వెంటనే పరిష్కరించాలని కోర్టు స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఈక్రమంలో మంగళవారం నూతలపాడు గ్రామానికి వెళ్లిన సర్వేయర్, ఆర్ఐ, ఇతర అధికారులను రైతులు అడ్డుకున్నారు. తాము 100 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమ దగ్గర నుండి భూమిని బలవంతంగా లాక్కోవడం సమంజసం కాదని వాపోయారు. రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. దింతో సర్వేని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు తహశీల్దార్ సంధ్యశ్రీ ప్రకటించారు.


తహాశీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పాఠశాలకు నీళ్ల ట్యాంకు బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యద్ధనపూడి మండలం పోలూరు గ్రామంలోని పర్చూరు శేషాచార్య గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థుల అవసరాల కొరకు మంచి నీటి నిల్వ చేసుకునే 300లీటర్ల సామర్థ్యం గల స్టెయిన్లెస్ స్టీల్ ట్యాంకును అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల దినోత్సవం రోజున బాలలకు విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. స్కూల్ కరెస్పాండెంట్ రావిపాటి సీతయ్య రోటరీ సేవలను కొనియాడారు. విద్యార్థులకు క్రీడా పరికరాలు సమకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, స్కూల్ హెచ్ఎం వి పద్మజ పాల్గొన్నారు.


పాఠశాలకు వాటర్ ట్యాంకు బహుకరిస్తున్న రోటరీ ప్రతినిధులు

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న రిలే నిరసనలు 9వ రోజు చేరుకున్నాయి. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కరించ పోవటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కరోనా సమయంలో నరేంద్ర మోడీ, జగన్ చెప్పిన మాటలు నీటి మూటలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చేసిన కృషికి వాళ్ళ కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకున్న నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. గ్రామంలో చెత్తకుప్పలు దర్శనం ఇస్తున్నాయని అన్నారు. వెంటనే అధికారులు కదలి వచ్చి కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు మాట్లాడుతూ 17వ తేదీ లోపు పరిష్కరించకపోతే ఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్మికుల పోరాటానికి టిడిపి మండల అధ్యక్షులు హనుమంత రావు, పంగులూరి హనుమయ్య, వీరగంధం ఆంజనేయులు, బోడావుల శివయ్య, వార్డు సభ్యులు బెల్లంకొండ సాంబయ్య, బి రాజేష్ బాబు, వలేరు మార్క్, శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. టిడిపి తరపున కార్మికులకు ఒక సంవత్సరం బట్టలు రెండు రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యం దెబ్బతిన్నవెంకటేశ్వర్లుకి ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు జీతాల సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. కార్మికుల పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తానికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పంచాయితీ కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న మజుందార్

టిడిపి, జనసేనతోనే ప్రజాప్రభుత్వం

ప్రజాశక్తి - రేపల్లె

టిడిపి, జనసేన పార్టీలతోనే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన నాయకుల సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహిం చారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అరాచకం సృష్టించిందని ఆరోపిం చారు. ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెడుతూ రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తుందని అన్నారు. ఎలాగైనా మరల అధికారంలోకి రావాలని చూడటం దురదృష్ట కరమని అన్నారు. ప్రకృతి వనరులన్నింటినీ దోచేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. నిరుద్యోగంతో పాటు పరిశ్రమలు లేక యువత దారితప్పి గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. టిడిపి, జనసేన పొత్తుతో 2024 ఎన్నికల్లో అధికారం చేపడతామనే దీమా వ్యక్తం చేశారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలకు ఉన్న సామర్థ్యాన్ని వివరించారు. ఉమ్మడిగా ఉంటూ కుటుంబంలా పనిచేయాలని అన్నారు. రెండు పార్టీల రాజకీయ అనుభవంతో దుర్మార్గపు పాలనకు సమర గీతం పాడాలన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రేపల్లె ప్రాంతంలో ఉన్నప్పటికీ ఇక్కడ ఉన్న కాపు యువతకు ఏ ఒక్కరికి ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం సిగ్గుచేటు అన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు గడప గడపకి మన ప్రభుత్వం అంటూ గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదని అన్నారు. ప్రతిపక్షాలను అణిచివేసి నిరంతరం ప్రజల్లో ఉండి మరోసారి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని విచ్ఛనం చేయాలనే దురుద్దేశంతో వైసీపీ పాలన సాగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టిడిపి, జనసేన సమావేశంలో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్


అక్కయ్యను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు వినోద్

సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోటపాడు గ్రామంకు చెందిన సిపిఎం సానుభూతిపరులు గొల్లమూడి అక్కయ్యను సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. అక్కయ్య చాలాకాలంగా సిపిఎం సానుభూతిపరునిగా ఉన్నాడు. ఆయన కుమారుడు గొళ్ళమూడి అంజయ్య గత మూడు దశాబ్దాలుగా సిపిఎం సభ్యుడిగా కొనసాగుతున్నాడు. అక్కయ్యకు కాలుకు గాయమై అది ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో వైద్యులు కాలును తొలగించారు. ప్రస్తుతం ఆయన మంచం పైనే ఉన్నారు. ఆయనను సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు, అంజయ్య, మోహనరావు పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని వినోదు బాబు అక్కయ్యను కోరారు.

డాక్టర్ శ్రీనివాస్ మృతి తీరని లోటు

ప్రజశక్తి - చీరాల

సూపర్ స్పెషాలిటీ వైద్య పితామహుడు, ప్రముఖ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ పి శ్రీనివాస్ ఆకస్మికంగా మృతి చెందటం తీరనిలోటని శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. మంగళవారం తెల్లవారు జామున ఆయన విజయవాడలో మృతి చెందినట్లు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ మరణం తమకు తీరని లోటని అన్నారు. 20సంవత్సరాలకుపైగా చీరాల, పరిసర ప్రాంత ప్రజలకు విజయవాడ రమేష్ హాస్పిటల్ నుండి ప్రతి బుధవారం గుండె వైద్య సేవలు అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన మంచి వైద్యుడని కొనియాడారు. చీరాలలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఏర్పాటు చేయడానికి డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీనివాస్ ముఖ్య కారణమని తెలిపారు. బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని తన స్వగృహం నందు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్

గోడపత్రికను ఆవిష్కరించిన 'ఆమంచి'

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి ఐటి వింగ్ గోడ పత్రికను వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ మంగళవారం ఆవిష్కరించారు. ఐటి వింగ్ ఇంచార్జి గూడ కృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 18న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ ఎర్రం సుబ్బారెడ్డి, అన్నంభొట్లవారిపాలెం సొసైటీ అధ్యక్షురాలు గోరంట్ల శివకుమారి, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, ముప్పాళ్ళ రాఘవయ్య, కంచెనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, అల్లాడి చెన్నయ్య, జూపూడి రోశయ్య, కూరాకుల ఇస్సాకు పాల్గొన్నారు.ధ

ట్రాఫిక్ ఎస్సైగా గోపి

ప్రజాశక్తి - చీరాల

పట్టణ నూతన ట్రాఫిక్ ఎస్సైగా నకరికంటి గోపిని నియమిస్తున్నట్లు ఎస్పీ వకూల్ జిందాల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టానున్నారు. గోపి గతంలో బాపట్లలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ట్రాఫిక్ ఎస్సైగా ఉన్న సాల్మన్ రాజు రిటైర్మెంట్ కానున్నారు.


ట్రాఫిక్ ఎస్ఐ ఎన్ గోపి


పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ ప్రదీప్

భవిష్యత్తు ఫార్మా రంగానిదే

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రాబోయే భవిష్యత్తు ఫార్మా రంగానిదేనని చిలుకూరి శ్రీధర్‌రావు సూచించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కొమ్ము ప్రదీప్ తన సహచరులతో కలిసి రూపొందించిన ప్రిన్సిపల్స్ ఆప్ బయోకెమెస్ట్రీ అండ్ మాలిక్యూలర్ బయాలజీ పుస్తకాన్ని దగ్గుబాటి విద్యా సంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధర్‌రావు ఆవిష్కరించారు. మెడిసిన్, ఫార్మశీ, బయోటెక్నాలజీ వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ వేణు పాల్గొన్నారు.


షుగరుపై అవగాహన కల్పిస్తున్న నాగజ్యోతి

షుగర్ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

షుగర్ వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ బొర్రా నాగజ్యోతి సూచించారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటి, చీరాల శ్రీ బాలాజి మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ నిర్వహించిన ఉచిత స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ షుగర్ వ్యాధిని పరీక్షించుకోవాలని సూచించారు. షుగర్ వుందని నిర్ధారణ అయితే అర్హత గత వైద్య నిపుణులచే వైద్యం చేయించుకోవాలని సూచించారు. 114 మందికి పరీక్షలు చేసి వైద్య సలహాలు ఇచ్చారు. శిబిరంలో సంస్థ అధ్యక్షులు రావినూతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాషా, బెల్లంకొండ నాగజ్యోతి పాల్గొన్నారు.


సమావేశంలో యువనేత అమర్‌నాద్

బీసీల సమావేశం

ప్రజాశక్తి - చీరాల

ఈ నెల 18న జరగబోయే జిల్లా అఖిలపక్ష బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ సెల్ పరిశీలకులు పులిమి డోలా శ్రీనివాసరావు, బీసీ సెల్ మండల అధ్యక్షులు అంగిరేకుల వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక టిడిపి కార్యలయంలో గౌరీ అమర్నాథ్ సమావేశం అయ్యారు. అఖిలపక్ష సమావేశానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విన్నకోట జగదీష్, పృద్వి రామారావు, హరిబాబు, గోశాల శ్రీనివాసరావు, భువనగిరి గురునారాయణ, వంగపాటి నరసింహారావు, రాంబాబు పాల్గొన్నారు.

ఉప్పుటూరులో అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

ఉప్పుటూరులో ఈనెల 17న అన్నదాన చేయనున్నట్లు నాగేంద్రం స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాల్వ సత్యనారాయణ సోమవారం తెలిపారు. పాలాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేస్తారని తెలిపారు.

ప్రజాశక్తి 5
బుధవారం 15 నవంబర్ 2023

జీవనశైలిలో జాగ్రత్తలతో సాధారణ జీవితం

జిజిహెచ్‌లో మధుమేహ వ్యాధిగ్రస్తులకు అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు

జీవన శైలిలో జాగ్రత్తలు, వైద్యుల సలహాలు పాటించి మధుమేహ రోగులు సాధారణ జీవితం కొనసాగించవచ్చని ఒం గోలు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వై ఏడుకొండలు, జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ అన్నా రు. అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం లో భాగంగా జిజిహెచ్ మరియు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సంధ్భంగా జిజిహెచ్ కి వచ్చిన పేషెంట్లకు అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దాదాపు1000 మంది ప్రజలకి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ బి.తిరుమలరావు, డాక్టర్ సుధాకర్‌బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ కల్యాణి , డాక్టర్ రాధిక, డాక్టర్ స్పందన, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

ఏఐ ద్వారా ఉచితంగా రెటీనా పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రపంచ డయాబెటిక్ దినో త్సవం సందర్భంగా స్థానిక అం జయ్య రోడ్డులోని సర్వనేత్రాలయ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రెటినోపతి స్క్రీనింగ్ పరీక్షలు మంగళవారం ఉచితం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కంటి వైద్యనిపుణులు, రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ మానస పెనుమెచ్చ మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులకు ఎక్కువగా ఎలాంటి లక్షణాలు లేకుండా రెటీనా సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని డయా బెటిక్ రెటినోపతి అంటారని, ప్రాథమిక దశలో గుర్తిస్తే మందులతో నయమవుతుందని, లేక పోతే ఆపరేషన్ అవసరమవుతుందని చెప్పారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి సంవత్సరం రెటీనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 30 వరకు తమ హాస్పిటల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉచితంగా కంటి రెటీనా పరీక్షలు చేస్తామని, ఈ అవకాశాన్ని షుగర్ పేషెంట్లు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉచితంగా రెటీనా పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మానస

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం స్థానిక జవహర్ నర్సింగ్‌హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద విదార్థిని సాహిత్యకు ల్యాప్‌ట్యాప్‌ను బహుకరించారు. ముప్వావారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి జవహర్ మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి చీమకుర్తి లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షులు నూనె హేమసుందరరావు, చీమకుర్తి లయన్స్‌క్లబ్ పేర్వ అధ్యక్షులు చలువాది బదరీనారాయణ, డైరెక్టర్ చలువాది రమేష్, ఉపాధ్యాయులు ముప్పరాజు వెంకటరావు, సుబ్రహ్మణ్యం, అల్లూరి శ్రీను పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ట్రైనీ డిఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాకు ఆరు నెలల పాటు ప్రాక్టికల్ శిక్షణ కోసం వచ్చిన ట్రైనీ డిఎస్‌పి షేక్ షహబాజ్ జిల్లా ఎస్‌పి మలికా గర్గ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పిని కలసిన ట్రైనీ డిఎస్‌పి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎస్‌పి సూచించారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో ట్రైనీ డిఎస్‌పి షేక్ షహబాజ్ తన శిక్షణ నిర్వహించనున్నారు.



ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రైనీ డీఎస్పీ

19న 'ఒయాసిస్'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఈ నెల 19న ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ దీపిక బొప్పన తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత రిజిస్ట్రేషన్, ఉచిత కన్సల్టేషన్, ఉచిత స్కాన్ మరియు నిర్ణీత పరీక్షలపైన 30 శాతం డిస్కౌంట్ అందించబడుతుందన్నారు. పూర్తి వివరాల కోసం 7416635670కు ఫోన్ చేసి నమోదు చేసుకోగలరని చెప్పారు.

భూ ఆక్రమణల్లో

అసలు వ్యక్తులను శిక్షించండి

వైసిపి రెబల్ నేత సుబ్బారావు గుప్తా డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



మాట్లాడుతున్న సుబ్బారావు గుప్తా

ఒంగోలు, పరిసర ప్రాంతాల్లో నకిలీ పత్రాలు, భూ కబ్జాలు, భూ అక్రమాల మీద సిట్ విచారణ తీరు బాగానే ఉన్నా.. ఈ కేసుల్లో అసలైన నిందితులను ఇంకా అరెస్టు చేయ లేదని, వారిని కూడా అరెస్టు చేసి శిక్షించాలని వైసిపి రెబల్ నేత ఎస్ సుబ్బారావు గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. సిట్ విచారణ విషయంలో పోలీసు అధికారుల తీరు నిష్పక్షపాతంగా ఉందని అభినందించారు. ఇదే క్రమంలో కొండను తవ్వి, ఎలుకను పట్టుకున్న సామెతగా ఈ కేసులు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. అరెస్టు చేసేవారిలో చాలా వరకు డమ్మీలు, చిన్నా, చితక వ్యక్తులు ఉంటున్నారని, అసలు నిందితులు బయట తిరుగుతున్నారని తెలి పారు. అక్రమాలకు పాల్పడేవారు బెయిల్‌పై వెం టనే బయటకు వస్తున్నారని, అలా కాకుం డా వారిమీద పిడియాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా అక్రమాలకు పాల్పడిన వారి సమక్షంలోనే కలెక్టర్ ద్వారా కోర్టు పరిధిలో వారి స్థలాలను వారికి ఇప్పించాలని కోరారు. రిజిస్టర్ కార్యాలయం కేంద్రంగా అనేక అక్రమాలు జరిగిన నేప ధ్యంలో అక్కడున్న రిజిస్టర్‌లను, ఇతర అధికారులను కూడా విచారించి, వారిమీద చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండువవారిపాలెం భూముల విషయంలో మేయర్ భర్త అక్రమాలకు పాల్పడ్డారని, రుజువులు బయటకు వస్తున్నాయని, ఆయన్ను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. మేయర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యా యం చేయాలని బాధితులు వారి వద్దకు వెళితే వారి పేరు మీద పవర్ ఆఫ్ అటార్నీ ఎలా రాయిం చుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంపై మేయర్ సిట్ అధికారు లను, కలెక్టర్‌ను కలవకుండా హైద రాబాద్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసేం దుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంగమూరు రోడ్డులో ఆరెకరాల బ్రాహ్మణుల భూమి ఆక్రమణల వ్యవహారంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డి, ఆయన వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ప్రమేయం ఉందన్నారు. వీటన్నింటినీ సిట్ అధికారులు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దుబాయ్‌లో ఉండే ఓ వ్యక్తి కొప్పోలు సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద భూమిని కొనుగోలు చేసి ఆ భూమిని తన అన్న వద్ద ఉంచితే ఆ భూమిని కాజేసేందుకు పలువురు వైసిపి నాయకులు పథక రచన చేస్తున్నారని, నకిలీ పత్రాలు సృష్టించి, పోలీసు స్టేషన్‌లోనే స్థలానికి బేరసారాలు పెట్టి అసలైన వారిని భూమి నుంచి బయటకు నెట్టేప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఆ భూ బాధితులను సుబ్బారావు గుప్తా విలేకర్ల సమావేశంలో ప్రవేశ పెట్టారు. పువ్వాడ సుబ్బారావు అనే వ్యక్తి భూమికి సంబంధించి కూడా ఇలాగే జరిగిందన్నారు. ఈ భూ అక్రమాలపై అన్నీ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు పోరాడాలని కోరారు.

నేడు 'ఆలూరి' హాస్పిటల్‌లో

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

డాక్టర్ మన్నం శింగయ్య మెమోరియల్ ట్రస్ట్ మరియు ఆలూరి మల్టీస్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించ నున్నట్లు ఆలూరి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ వి.సుందరరావు, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాతులూరి నరసింహ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల కన్సల్టెన్సీ సదుపాయం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులో న్యూరో సర్జరీ, న్యూరాలజీ, ఆర్థో పెడిక్స్, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఇయన్టీ, ఆప్తమాలజీ.. వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే వారికి ఉచితంగా మందులతో పాటు బి.పి., ఇసిజి, బ్లడ్ షుగర్, అవసరమైన వారి కి ఎక్స్రే, అల్ట్రాసౌండ్ ఉచితంగా చేయనున్న ట్లు పేర్కొన్నారు. సమాజసేవ చేయాలనే ఉద్దేశ్యంతో అతి తక్కువ ధరకే వైద్యసేవలను అందరికీ అందించాలనే సదుద్దేశ్యంతో డాక్టర్ మన్నం శింగయ్య మెమోరియల్ ట్రస్ట్ సహాయ సహకారాలతో హెల్త్‌కార్డును రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్డు ద్వారా 365 రోజులు హాస్పిటల్లో ఏ డాక్టర్ వద్దనైనా ఓ.పి ఉచితమని, లాబొరేటరీ బిల్లులో 20 శాతం రాయితీ, హాస్పిటల్లో అడ్మిట్ అయిన వారికి 15 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి, వారి కుటుంబ సభ్యులకు సహాయపడాలనే ఉద్దేశ్యంతో ఈ కార్డును మంజూరు చేస్తున్నా మన్నారు. ఈ క్యాంపు ద్వారా డిసెంబర్ 31 వరకు అతి తక్కువ ధర రూ.94,999/-కే జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీ చేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా ఎపియస్ఆర్టీసి రీజినల్ మేనేజర్ పాల్గొంటారని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమ పేర్కొన్నారు. ఈ క్యాంపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శరీరంలో 'షుగర్' చిన్న మార్పు మాత్రమే..

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చు
- షుగర్ వ్యాధిగ్రస్తుల ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

షుగర్ అనేది మన శరీరంలో జరిగే చిన్న మార్పు మాత్రమేనని, నిరంతరం వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లు పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని పలువురు షుగర్ వ్యాధి వైద్యనిపుణులు అన్నారు. వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా నగరంలోని ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులతో మంగళవారం స్థానిక ఐఎంఎ హాలులో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రక్తపరీక్షలు, బిపి పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో నగరంలోని షుగర్ వ్యాధి ప్రత్యేక వైద్యులు డాక్టర్ మలినేని శ్రీనివాసరావు, డాక్టర్ అరుణారెడ్డి, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని వైద్య సేవలందించారు. షుగర్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఉచిత షుగర్ వ్యాధి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు పలువురు వైద్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

జగనన్న పథకాలతో పేదలకు భరోసా

వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్రంలోని కోట్లాదిమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం పరిధిలో "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్ అవసరం మళ్ళీ మళ్ళీ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఈవోపీఆర్టి నర్రా జగదీష్ బాబు, సోమేపల్లి మురళీకష్ణ, సూదనగుంట సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

శింగరాయకొండ: శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం -3 లో సర్పంచ్ తాటిపర్తి వనజ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి హాజరయ్యి ప్రసంగించారు. అనంతరం బుంగ బావి పార్కు వద్ద వైసిపి జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, వైస్ ఎంపీపీ షకీలా, ఎంపిటిసి బషీర బేగం పాల్గొన్నారు.



సమావేశంలో బిఎస్‌పి జిల్లా సెక్రటరీ డాక్టర్ శ్రీనుబాబు

బీఎస్పీ అసెంబ్లీ సమావేశం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

బీఎస్పీ వేమూరు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శీను బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గ నుండి బీఎస్పీ అభ్యర్థిని పోటీలో నిలబెట్టడం జరుగు తుందని తెలిపారు. ఆ మేరకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అన్నారు. వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసి అంశాలపై నాయకుల నుండి వివరాలు సేకరించారు.



సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా కేంద్రమైన బాపట్లలో నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం రథం బజార్‌లో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. నాయి బ్రాహ్మణ జిల్లా కార్యదర్శి చీమకుర్తి కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా నాయి బ్రాహ్మణ సంఘానికి ఇంతవరకు కమ్యూనిటీ హాలు ఒనగూరలేదని అన్నారు. ఎంఎల్‌ఎ కోన రఘుపతికి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో చెరుకూరి సుబ్బారావు, అన్నవరపు వెంకటరావు, పెళ్లట్ల ఆంజనేయులు, ఉంగుటూరు సుబ్బారావు, వి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సెల్వరాజు

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆల్బీనా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25మంది స్పోకెన్ ఇంగ్లీష్‌లో రాణిస్తున్న విద్యార్థులకు దుస్తులు, స్టేషనరీ సామాగ్రిని మంగళవారం అందజేశారు. చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సెల్వరాజ్ మాట్లాడుతూ ఐలవరం పాఠశాల విద్యార్థులు ప్రపంచంలోని వివిధ దేశాల ఉపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించటం, ఆంగ్ల ఉపాధ్యాయులు హరికృష్ణకు గ్లోబల్ టీచర్స్ ప్రైజెస్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 50మంది జాబితాలో ఒకరు కావడం, దానిని గూగుల్ ద్వారా గమనించి తన వంతు సహాయం అందించాలనే ఆలోచన వచ్చినట్లు తెలిపారు. అనంతరం సెల్వరాజ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాచర్ల మోహనరావు పాల్గొన్నారు.

కాలువలో దిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన పెనుమూడి వినేష్ (14) అనే 8వ తరగతి విద్యార్థి స్నానానికి కాలువలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వినేష్ తన స్నేహితులతో కలిసి కొల్లూరు మండలం తడిగిరిపాడు గ్రామ సమీపంలోని కాలువలోకి స్నానానికి దిగాడు. దీంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి గల్లంత కావడంతో స్థానికులు కాలువలో వెతకగా మృతి చెంది నీళ్లలో తేలాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాల్యం నుండే క్రమశిక్షణతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి షేక్ రెహానా

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు బాల్యం నుండే క్రమశిక్షణతో మెలగటం అలవర్చుకుంటే జీవితంలో రాణిస్తారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఈపురుపాలెం బైపాస్ రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్జి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. బాల్యం నుండి ప్రతి ఒక్కరూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా, ఇష్టపడి చదువుకుంటూ మన దేశ రాజ్యాంగ నియమ నిబంధనలను అనుసరిస్తూ జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె సరళ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి రమేష్ బాబు, అడ్వకేట్ ఎ సతీష్‌రెడ్డి, పిఎల్ వియస్డీ మతీన్, షిలోహు ఆర్‌కె, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

రేపల్లె : మౌంట్ ఫోర్ట్ పాఠశాల, రామకృష్ణ పబ్లిక్ స్కూల్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని అన్నారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత ఆశయంతో ఉండాలని చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

భట్టిప్రోలు : ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చిత్రలేఖన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన 8వ తరగతి విద్యార్థులైన వై రత్నదీపకు ప్రథమ బహుమతి, బి జెస్సికి ద్వితీయ బహుమతి, సిహెచ్ జెస్సికాకు తృతీయ బహుమతులను ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షులు తూనుగుంట్ల నాగ సుధారాణి, కార్యదర్శి ఎండూరి సూర్య ప్రభావ, బొలిశెట్టి శ్రీవాణి, మాటూరు గృహలక్ష్మి చేతుల మీదగా అందజేశారు. జవహర్‌లాల్ నెహ్రూ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వేల్పూర్ నాగేశ్వరరావు, హెచ్‌ఎం భారతి పాల్గొన్నారు.

సంతమాగులూరు : స్థానిక శాఖ గ్రంథాలయం నందు మంగళవారం జాతీయ గ్రంథాలయ 65వ వారోత్సవాలలో భాగంగా మొదటిరోజు బాలల దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు, నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నెహ్రూ దేశానికి చేసిన సేవలను కొనియాడారు కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్ ఎండి అల్తాఫ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగులూరు : స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక నెహ్రూ విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశపు తొలి ప్రధానిగా నెహ్రూ అనితర సాధ్యమైన పాలనను అందించారని అన్నారు. దేశ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాయిని ప్రమీల, రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాయిని వెంకట సుబ్బారావు, రోటరీ క్లబ్ కోశాధికారి గుర్రం ఆంజనేయులు, రోటరీ కన్వీనర్ చిలుకూరు వీరరాఘవయ్య, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, వైసీపీ నాయకులు గుడిపూడి రామారావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : స్థానిక ఆదర్శ హైస్కూలులో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సివిల్స్‌లో 311వ ర్యాంకు సాధించిన మార్టూరుకు చెందిన వీరగంధం లక్ష్మీ సుజాత హాజరయ్యారు. సభకు కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ అధ్యక్షత వహించారు.

బాపట్ల : బాల బాలల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ప్రతి విద్యార్థి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ నటరాజ్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ఇడుపులపాడులో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల్లో మొదటి రోజులో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి నిర్వహించారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.

కారంచేడు : స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు తమ తీరిక వేళల్లో గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు భరోసా అధ్యక్షులు తెల్ల చిపిరయ్య, ఎంపీ యూపీ పాఠశాల ఉపాధ్యాయిని ఉషారాణి, గ్రంథా పాలకులు ఎం నాగయ్య పాల్గొన్నారు.

చీరాల : పట్టణంలోని విఠల్ నగర్‌లోని ఎస్‌ఎఆర్‌ఆర్ఎం హై స్కూల్‌లో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కె వీరాంజనేయులు అధ్యక్షతన బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సురేష్ బాబు, భవాని, మీన అనూష, రామిరెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మండలంలోని పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సీఈఓ ఫైనం గణేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి బాలల దినోత్సవ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ నర్గీస్ క్యాజి పర్యవేక్షించారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పోటీలు

ప్రజాశక్తి -భట్టిప్రోలు

స్థానిక శాఖ గ్రంథాలయంలో సర్పంచి ధారా రవికిరణ్ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభించారు. పురవీధుల్లో విద్యార్థులతో కలిసిర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి జరుపుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కలపాల సుభాష్ చంద్రబోస్, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, నాయకులు చెన్నయ్య పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక బంగళ రోడ్డుని శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులు, ఎంఈఓ డి గంగాధర్, శాఖ గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు, హెచ్‌ఎం ఎన్ వెంకట్రామయ్య జెండా ఆవిష్కరించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాసులు మాట్లాడుతూ పుస్తక పఠనం మేధో సంపత్తిని పెంపొందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవాటు చేసుకుని కోరారు. తహశీల్దారు జివి సుబ్బారెడ్డి చొరవతో గ్రంథాలయంకు శాశ్వత భవనానికి త్వరలోనే స్థల సేకరణ పూర్తవుతుందని త్రిమూర్తులు తెలిపారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు, అనిల్ కుమార్ సూరి, ఉష్యోతి, ఆకుల విష్ణుతేజ, మందా జోసెఫ్ పాల్గొన్నారు.

నగరం : మండలంలోని మంత్రిపాలెంలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మాజీ



గ్రంథాలయ వారోత్సవ సభలో జిల్లా అధికారి డి ప్రసాదరావు

ప్రధాని జవహర్ లాల్ చిత్రపటానికి పీఏసీఎస్ చైర్మన్ ఆర్ కాంతారావు, మంత్రిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ వెంకటేశ్వరరావు, సేంద్రియ వ్యవసాయదారుడు ఎం రాధాకృష్ణమూర్తి పూలమాలలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ లైబ్రేరియన్ జొన్నా బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

చీరాల : విద్యార్థిదశ నుండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంపిడిఒ నేతాజీ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయం ఆవరణలో దేశభక్తి గీతాల ఆలాపన పోటీలు మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహమద్ ఆకస్మిక తనిఖీ చేశారు. వారోత్సవాలు జరుగుతున్న తీరుని పరిశీలించారు. గ్రంథ పాలకురాలు డి ధనమ్మ, వలివేటి మురళీకృష్ణ, అన్నంరాజు సుబ్బారావు, సర్వశెట్టి సుబ్బరామయ్య, రాణెమ్మ, రూపాదేవి, చుండూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాపట్ల : గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. వారం రోజులు పాటు జరిగే కార్యక్రమాలను జిల్లా అధికారులు ఎస్ నిరంజన్, డి ప్రసాదరావు ప్రారంభించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయ అధికారి శివాజీ గణేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, బాలసాయి, ప్రియ, ఎం నరసింహారావు, హర్షద్ కుమార్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : మండలంలోని ఇడుపులపాడులో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం పురస్కరించుకొని జెండా ఎగురవేశారు. నెహ్రూ జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హాజరైన బాలికలకు మిఠాయిలు పంచిపెట్టారు. గ్రంథపాలకురాలు ఎ శకుంతల పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు మంగళవారం మండల ఉపాధ్యక్షులు మురాల రాంబాబు, వైసీపీ సీనియర్ నాయకులు కమ్మెల సాంబశివరావు, కనపర్తి మోహన్‌రావు ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి దినపత్రికలను చదవాలని సూచించారు.



నగరంలో గ్రంథాలయ వారోత్సవ ర్యాలీ

వైసిపీ పాలనలో అన్నీ అరాచకాలే : నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

వైసీపీ పాలనలో అన్ని అరాచకాలేనని టిడిపి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలోని రైలుపేట 4వ వార్డు పొట్టి శ్రీరాములు పార్క్ వద్ద నుండి నరేంద్ర వర్మ ఇంటింటి ప్రచారం మంగళవారం నిర్వహించారు. వైసిపి అధికారానికి వచ్చిన తర్వాత ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని అన్నారు. ఎంఎల్ఎ కోన రఘుపతి రోడ్లు వెడల్పులో డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయలేదని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలను పట్టించుకోని కారణంగా ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అరాచక ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, ఫరీద్ మస్తాన్,


ఇంటింటికీ టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

పరిశా రమేష్ గౌడ్, తాతా చినబాబు, రాహుల్, సోమ శేఖర్, బాల శంకర్, విన్నకోట వీరయ్య నాయుడు, మానం శ్రీనివాసరావు, కొల్లూరి వెంకట్రావు, మందపాటి ఆంధ్రేయ, సూరగాని శేఖర్, షేక్ షాకా, ఉప్పాల కృష్ణ గౌడ్, కోటేశ్వరరావు, శివన్నారాయణ, కందేపు శ్రీకాంత్, మారుతి ప్రసాద్, మొహనరావు, మెట్లు శ్రీనివాసరావు, గొర్ల గోపి, సూరగాని మురళి, భావన్నారా యణ, మురళి, రాఘవేంద్ర, కేసాని రాజు, షేక్ ఖాన్ పాల్గొన్నారు.

చీరాల : నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను కోరారు. పట్టణంలోని 18వార్డులో చంద్రబాబు షఉరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పులిపాటి శేఖర్, రసాల శ్రీనివాసరావు, కోండ్రు రత్నబాబు, చైతన్య పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

దేశానికి స్వాతంత్రం వచ్చి 70సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బీసీ కులాల్లో రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దామాషా వాటా హక్కులు కల్పించడంలో రాజకీయ పార్టీలు, పాలక ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని జై భీంరావు భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది దోవ రమేష్ రాంజీ పేర్కొన్నారు. రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు పాతపాటి అంజిబాబు రజక ఆధ్వర్యంలో ఈ నెల 26న గుంటూరు, విజయవాడ మధ్య జాతీయ రహదారి ప్రక్కన ఏర్పాటు చేయనున్న రజక ఆత్మగౌరవ మహాసభ గోడపత్రికలను మంగళవారం రేపల్లె డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రజక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రమేష్ రాంజీ మాట్లాడుతూ రజకుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏర్పాటు


అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న జైభీభారత్ పార్టీ నేతలు

చేస్తున్న మహాసభకు జై భీమ్ భారత్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. జైభీం పార్టీ అధినేత, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు రజకుల హక్కుల సాధన పోరాటంలో భాగస్వాములౌతామని స్పష్టం చేశారు. 2024సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు రజకులకు అసెంబ్లీ, పార్లమెంటు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దోబీ ఘాట్లను పరిరక్షించాలని కోరారు. 50ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. బహిరంగ సభకు రజకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలా జోజి బాబు, ఎమ్మార్పీస్ జిల్లా కమిటీ సభ్యులు పోలిమెట్ల నాగేశ్వరరావు, జై భీంరావు భారత్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రజక యువత, రాష్ట్ర నాయకులు కామరాజుగడ్డ సోమేశ్వరరావు, జెపిపి పార్టీ మండల కన్వీనర్ కర్ర బాబురావు, నెరసు వెంకటరావునాయుడు, యనమల సుబ్బారావు, న్యాయవాదులు కర్ర ప్రతాప్, నల్లూరి వెంకటేశ్వరరావు, పి జీవన్ కుమార్, నేత్ర వాసు, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మన పల్లెకు 'మన ఏలూరి'

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు టిడిపి మినీ మేనిఫెస్టు, భవిష్యత్తు గ్యారెంటీ ప్రజలకు వివరించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండలంలోని ఇడుపులపాడు కు నేడు రానున్నారు. పోలేరమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో పూజల అనంతరం నాయకులతో సమావేశం అవుతారని తెలిపారు. 4 గంటలకు వాటర్ ట్యాంక్ బజార్ మీదుగా 1, 2, 3, 4వార్డులలో పాదయాత్ర చేస్తారు. లైబ్రరీ సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి సభలో ప్రసంగిస్తారు. రాత్రి 6గంటలకు మాదిగ పల్లెలో పాదయాత్ర అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. మాలపల్లెలో అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు కోరారు.


ఎంఎల్ఎ ఏలూరి

సొన తవ్వకాలపై నిఘా పెట్టండి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ వివేకానంద కాలనీలో సర్వేనెంబర్ 75/3 సోనా భూమిలో అక్రమార్కులు జెసిబిలతో గత 3రోజుల నుండి రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ సెక్రెటరీ కె శివలీల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చల్లారెడ్డిపాలెం వీఆర్ఓ పివి కోటేశ్వరరావు సెబ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇసుక తవ్వకాలు జరుపుతున్న జెసిబిని గుర్తించి అధికారులు నిలుపుదల చేశారు. ఘటనా స్థలానికి ఆర్ఐ, విఆర్ఓ, సబ్ సిబ్బంది చేరుకొని కూడా జెసిబిని వదిలివేయటంపై విమర్శలు వస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సొన కాల్వల్లో ఇసుక అక్రమ తవ్వకాల దృశ్యం

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపి మోపిదేవి

ప్రజాశక్తి - రేపల్లె

గ్రామం నుంచి రాజధానుల వరకు నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలకు వివరించే కార్యక్రమమే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఉద్దేశమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని 16, 18వార్డుల పరిధిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ డిసెంబర్ 19 వరకు జరుగుతుందని అన్నారు. నాలుగున్నర ఏళ్లలో సాధించిన అభివృద్ధి విజయాలను, 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టామంగా, వైఎస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, విశ్వనాథ గుప్త, పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంతమాగులూరు : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్ల పాలనలో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించడం కోసమే సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ చేస్తున్నట్లు జెడ్పిటిసి అడవి శ్రీనివాసరావు తెలిపారు. ఏల్చూరు సచివాలయం–3లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అందించినటు వంటి నగదు వివరాలతో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డు మంగళవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోటి 40లక్షల కుటుంబాలు నేరుగా ప్రయో జనం పొందారని అన్నారు. ప్రజల జీవితాలలో మార్పు వచ్చిందని అన్నారు. సంక్షేమమే అభివృద్ధని సిఎం నిరూపించారని అన్నారు. సచివాలయం పరిధిలో 1000 మంది లబ్ధిదారులు రూ.22కోట్లకుపైగా లబ్ధి పొందారని అన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఒక భద్రతను, నమ్మకాన్ని కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, వెల్లలచెరువు సొసైటీ అధ్యక్షులు చింతా శ్రీధర్ బాబు, మాజీ వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు బొల్లినేని రామకృష్ణ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని పూనూరు సచివాలయం2 నందు ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధిదారులుకు అందించిన నగదు వివరాల బోర్డులను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కృష్ణ కుమారి మాట్లాడుతూ నగదు వివరాలు తెలియజేయడం ద్వారా అసలైన అర్హులుకు ప్రభుత్వ పథకాలు అందింది, లేనిది తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మోహనరావు, పూనూరు ఎంపిటిసి సునీత, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపిడిఓ కృష్ణకుమారి


రాజకీయ పార్టీల సమావేశంలో ఆర్‌డిఓ హేలా షారోన్

రాజకీయ పార్టీల సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎపి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి రాజకీయ ప్రతినిధుల సమావేశంలో ఆర్‌డిఓ హేలా షారోన్ మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేసిందని అన్నారు. అన్ని పార్టీల నాయకులు ఆ ఓటర్ లిస్టులను పరిశీలించుకుని సవరణలను బిఎల్ఎలకు తెలపాలని అన్నారు.


ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న డిఎం రామమోహనరావు

కార్గో సేవల్లో మొదటి స్థానం

ప్రజాశక్తి - అద్దంకి

కార్గో సేవల్లో ఆర్టిసి అద్దంకి డిపో ప్రధమ స్థానంలో ఉందని కార్గో ఏటిఎం నవీన్ కుమార్ తెలిపారు. పట్టణంలోని గ్రామీణ ప్రాంతంలోని ఆర్టిసి డిపో అందిస్తున్న కార్గో సేవలను డిపో మేనేజర్ బి రామ మోహనరావుతో కలిసి ఏటిఎం నవీన్ కుమార్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో గ్యారేజ్ గేట్ వద్ద ఉద్యోగులలో మాట్లాడుతూ అద్దంకి డిపో టార్గెట్ 1395 డోర్ డెలివరీ టార్గెట్‌కు గానూ 1322డోర్ డెలివరీలు చేసి జిల్లాలో ప్రధమ స్థానంలో నిలవడమే కాకుండా ఆర్టిసి కార్గో ఆదాయం 40శాతం సాధించిందని తెలిపారు. డిఎం రామమోహనరావు మాట్లాడుతూ ఈ టార్గెట్ పూర్తిలో ఉద్యోగుల కృషి సహకారం ఉందని తెలిపారు. ఈ టార్గెట్ చేరుకునేందుకు కృషి చేసిన డిపోలోని ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. రాబోవు కాలంలో 100శాతం టార్గెట్ పూర్తి చేస్తామని తెలిపారు.


విలేకర్ల సమావేశంలో తాతా జయప్రకాష్‌నారాయణగౌడ్

బీసీల అఖిలపక్ష రౌండ్ సమావేశం

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి బీసీ అఖిలపక్ష సమావేశం ఈ నెల 18న ఎమ్మెస్సార్ కళ్యాణ మడపంలో నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజవర్గాల టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం, బిఎస్పి, నవతరం, జై భీమ్, సమాజ్ వాద్, ఆమ్ ఆద్మీ పార్టీలన్ని ప్రజా సంఘాలు, కుల, వృత్తుల సంఘాలతో టిడిపి బీసీ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రేపల్లె ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్, కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కౌతరపు జనార్ధనరావు, దివి రాంబాబు, రాయన ప్రసాదరావు, విచారపు మునేశ్వరరావు, అవ్వారు సాంబయ్య, పరిశా రమేష్, పులిమి శివకుమార్, విన్నకోట జగదీష్, సురగాని మురళి పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో జిల్లాలోని క్రీడాకారులు మంచి పతకాలు సాధించి జిల్లా కీర్తిని మరింత ఇనుమడింప చేశారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. బాపట్లలోని హై వెండ్ స్కూల్ క్రీడాకారులు జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక కావడం సంతోషదాయకమని జిల్లా కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు 1 నుండి 3 వరకు నిర్వహించిన 67 వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు నంద్యాలలో జరిగాయని డైరెక్టర్ పి చాందినీ అన్నారు. హై వెండ్ స్కూల్ క్రీడాకారులు పతకాలు సాధించి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు, చైర్మన్ పి ఉదయ్ చంద్రరావు, కలెక్టర్ రంజిత్ బాషాని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు నాగ జ్యోతి, పి.శివ సాయి పర్థవ్ రెడ్డి, పి.ఇంద్ర సేన, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ గోపి చంద్‌ని కలెక్టర్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

విజన్ ఉన్న నేత చంద్రబాబు

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని, రానున్న ఎన్నికలలో ఆయనను గెలిపించుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. జనం కోసం జనార్ధన్, బాబు షఉరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా దామచర్ల జనార్ధన్‌రావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు .వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, ఇందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, కామేపల్లి శ్రీనివాసరావు, రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్, షేక్ కపిల్ బాషా, డివిజన్ అధ్యక్షులు ఆవుల శ్రీను, కొనంకి శ్రీనివాస్, మంచాల వెంకటేశ్వర్లు, మంచాల శ్రీనివాసులు, బొల్లినేని వాసు కష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దామచర్ల జనార్ధన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

ఒంగోలు డిఎం శ్రీనివాసులు

ప్రజాశక్తి-టంగుటూరు

కార్తీకమాసం సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒంగోలు డిపో నుండి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధర్మవరపు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం టంగుటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక బస్సుల వివరాలను తెలియజేస్తూ ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలలోని పంచారామాలైన అరుణాచలం, శ్రీశైలం, శబరిమలై తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. టంగుటూరు నుండి పంచారామాలకు వెళ్లగోరు ప్రయాణికులు ఆర్టీసీ ప్రవేశపెట్టే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 73828 91954 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టంగుటూరు బస్టాండ్ కంట్రోలర్ వి శోభారాణి, ఆర్టీసీ మార్కెటింగ్ విభాగం జిఆర్ బి ముఖర్జీ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ట్రైనీ డిఎస్‌పి విద్యాశ్రీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ప్రాక్టికల్ శిక్షణ పొందే నిమిత్తం విచ్చేసిన 2022 బ్యాచ్ కు చెందిన ట్రైనీ డి.ఎస్.పి తాళ్లూరి విద్యాశ్రీ జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకిత భావంతో విధులు నిర్వహించి, విజయవంతంగా శిక్షణను పూర్తిచేసుకోవాలని ఎస్పీ సూచించారు.


ఎస్పీకి మొక్క అందజేస్తున్న ట్రైనీ డిఎస్‌పి

బాలల దత్తతపై అవగాహన అవసరం

అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాలల దత్తత గురించిన అవగాహన ప్రతి ఒక్కరికీ ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం చర్చి సెంటర్లో మానవహారం నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ బాలల హక్కుల కమిషన్, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బాలల దత్తత, వారి హక్కులపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీని నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి బాలల స్వేచ్ఛకు చిహ్నంగా తెల్ల పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో బాలల దత్తతపై అవగాహన తక్కువగా ఉందన్నారు. ఈ నవంబర్‌ను బాలల దత్తత నెలగా కేంద్రం ప్రకటించటంతో ఈ వారోత్సవాల సందర్భంగా ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బాలికల హక్కులు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేకంగా మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆడపిల్లలు మధ్యలోనే స్కూలు మానివేయకుండా కనీసం ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా బాలికా వికాసం పేరుతో ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. తమ సచివాలయ పరిధిలో జరిగే ప్రతి వివాహ సంబంధ వివరాలను మహిళా పోలీసులు ద్వారా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయిస్తున్నామన్నారు. గత నెలలో 21 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఆడపిల్లలకు ప్రత్యేక పునరావాసం కల్పించి పాఠశాలలో చేర్పించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడేలా నైపుణ్యాభివద్ధి కల్పిస్తూ మనోధైర్యం పెంపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, జిల్లా బాలల - సంక్షేమ కమిటీ చైర్మన్ వి.రామాంజనేయులు మాట్లాడుతూ బాలలకు ఉన్న హక్కులపై వారి తల్లిదండ్రులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ మాధురి, మెప్మా, డిఆర్‌డిఏ పీడీ టి. రవికుమార్, వికలాంగుల శాఖ ఏడీ అర్చన, ఇన్‌చార్జి డిసిపిఒ ప్రమోద్ కుమార్, ఎస్‌బిసిసి జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్ ఒంగోలు ఎంఇఒ కిషోర్ కుమార్, సిడిపిఒలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

మూడంచెలలో సహకార రంగ అభివృద్ధి

పిడిసిసి బ్యాంకు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సహకార రంగాన్ని మూడంచెల వ్యవస్థ ద్వారా అభివద్ధి చేసేందుకు కషి చేస్తామని ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి తెలిపారు. 70వ సహకార వారోత్సవాల సందర్భంగా ఒంగోలు నగరంలోని కేంద్ర సహకార బ్యాంక్‌లో కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడిసిసి బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు జరుగుతున్నాయని రోజుకు ఒక అంశంపై చర్చ నిర్వహిస్తున్నామని తెలిపారు. "భారత దేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గా పెంచటం, పర్యావరణ అనుకూల అభివద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర" అనే అంశంపై ప్రధానంగా చర్చ జరుగుతుందని తెలియజేశారు. ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, బ్యాంకు సిబ్బంది బ్యాంక్‌లో జరుగుతున్న డిపాజిట్లు సేకరణ, ఇతర సేవలను తెలియజేసి బ్యాంక్ ఆర్థిక పరిపుష్టి, రైతులకు రుణాలు, సత్వర న్యాయం తో సహకార వ్యవస్థను ముందు నడుపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిఇఒ వై.ప్రకాష్, డిసిఒ పి.రాజశేఖర్, డిఆర్ ఫ్యాకల్టీ ఎం.కనక దుర్గారెడ్డి పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీస్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఉదయం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, రేపల్లె డిఎస్పి టి.మురళీకష్ణ, బాపట్ల డి.ఎస్.పి టి.వెంకటేశులు, చీరాల డి.ఎస్.పి ఎస్.ప్రసాదరావు, ఎస్సీ ఎస్టీ సెల్ డి.ఎస్.పి ఏ.వి.రమణ, ఏ.ఆర్.డి.ఎస్.పి ఎం.డి.హెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. గ్రేవ్ కేసులు, ఫోక్సో కేసులు, మిస్సింగ్ కేసుల పై, ఇతర పలు విషయాలపై ఎస్పీ సమీక్షించారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా చెయ్యడానికి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు,సిబ్బంది చట్ట పరిధిలో విధులు నిర్వహించాలన్నారు. చట్టాన్ని అతిక్రమించి అవినీతికి పాల్పడిన, ప్రలోభాలకు లోనైనా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర ప్రభుత్వ శాఖ ఉద్యోగాలతో పోలిస్తే పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. ఆ సవాళ్లను అధిగమిస్తూ నిబద్ధత తో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పోలీస్ సిబ్బందికి వారి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు,వార్డులను దత్తతగా స్వీకరించి, తరచు సందర్శిస్తూ అక్కడ జరిగే వివిధ పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని స్టేషన్ ఎస్.హెచ్.ఓ కు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. క్రింది స్థాయి పోలీస్ సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తే నేరాలను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. జిల్లాలో గంజాయిని చాలా వరకు కట్టడి చేయగలిగామన్నారు. ఇదే విధమైన కషిని కొనసాగిస్తూ రాబోయే రోజుల్లో జిల్లాలో గంజాయి, నాటు సారాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. పేకాట, కోడిపందాలు జిల్లాలో ఎక్కడా కూడా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది వారి రోజువారి విధులకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా లాటి తీసుకు వెళ్లాలన్నారు. పగటి పూట పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థిని విద్యార్థులు వెళ్లే సమయాలలో, వచ్చే సమయాలలో ఆ ప్రదేశాలలో తప్పనిసరిగా పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహించాలన్నారు. బ్యాంకుల వద్ద, ప్రధానమైన కూడళ్ళలో పోలీస్ నిఘా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెట్లు, ఇతర నేరస్తుల కదలికల పై నిరంతర నిఘా ఉంచాలన్నారు. కార్తీక మాసం ప్రారంభమైనందున బాపట్ల జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్, నిజాంపట్నం తదితర ప్రాంతాలలోని సముద్ర తీరాలకు పవిత్ర స్నానాలు ఆచరించడానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. .

కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన హత్యా కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారా శిక్ష పడడంలో విశేషంగా కషిచేసిన బాపట్ల రూరల్ సిఐ జి.వేణుగోపాల్ రెడ్డి, కర్లపాలెం ఎస్.ఐ ఎమ్.శివయ్య, హెడ్ కానిస్టేబుల్ అఫ్జల్ బేగ్ లను, ఉత్తమ పనితీరు కనబరిచిన డి.సి.ఆర్.బి లో విధులు నిర్వహించే మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఎస్.చంద్రికా, కానిస్టేబుల్ కె.గోపి, ఐ.టి కోర్ విభాగంలో విధులు నిర్వహించే కానిస్టేబుల్ ఎమ్.నాగరాజులను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.